

ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర

సంపుటి : 8 | సంచిక : 15 | పుష్పం : 40-42 | 20-4-2003



**RAMANA BHASKARA**

TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE

PAGES : 16

VOL : 8 ISSUE : 15

EDITOR
P.S. RAMA RAJU

EDITING
P.H.V. SATYAVATHI
(HYMA)

SUBSCRIPTION
Yearly : **Rs. 150/-**
Each Copy : **Rs. 8/-**

ADDRESS
**RAMANA BHASKARA**
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.

PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689

PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260

## శ్రీ రమణుల మహానిర్యాణము

భగవాన్ శ్రీరమణ మహర్షుల వారు దక్షిణదేశమున "తిరుచ్చుళి" అను గ్రామమున 1879 డిసెంబరు 30వ తేదీని జన్మించిరి. వీరి తండ్రి సుందరమయ్యర్, తల్లి అళఘుమ్మల మూడవ సంతానము శ్రీ రమణులు. భగవాన్ శ్రీరమణులు జ్ఞాన గురువు, కుమారాంశ సంభూతులుగా దేశవిదేశముల యందు ప్రసిద్ధులైయున్నారు. వీరి పూర్వనామము వేంకటరమణ. వీరి బాల్యము సామాన్యముగనే నడచినది. వీరి బంధువుల ద్వారా "అరుణాచలం" అనెడి పేరు వినినంతనే వీరు ఒక అవ్యక్త దివ్యాను భూతికి లోనైరి. తరువాత "పెరియపురాణము"లో గల శివభక్తుల చరిత్రలు చదివి భక్తిభావములో మునిగి దివ్యానందాన్ని పొందుతూ యుండేవారు.

వీరు 16వ యేటను ఆకస్మికముగా, యెట్టి సాధనలు, గురూపదేశము లేకుండగనే మరణానుభూతికి లోనై ఆత్మనిష్ఠులైరి. దాని పరిణామదశయే 1896 సెప్టెంబరు 1వతేదీ అరుణాచల ఆగమనము. అరుణాచలములో భగవాన్ సుమారు 50 సంవత్సరములు యుండియున్నారు. బ్రాహ్మణస్వామి, మౌనస్వామియని పిలువబడుతూ యుండిన శ్రీరమణులకు "భగవాన్ శ్రీ రమణమహర్షి" అను నామమును కావ్యకంఠ గణపతిముని సూచించారు. గణపతిముని మంత్రద్రష్ట, వాక్శుద్ధి, పండితుడు యైయుండియూ భగవాన్ ద్వారా తపస్స్వరూపమును తెలుసుకొనిరి. తరువాత వీరు రమణగీతను, చత్వారింశత్ అను స్తోత్రమును రచించిరి.

ఉపదేశసారము, ఉన్నది నలుబది, నేనెవడను, విచారమణిమాల, ఏకాత్మ పంచకము, అరుణాచలస్తుతిపంచకము మొదలగు వీరి రచనల యన్నిటినందును గల ముఖ్యబోధ "నేను" పైనే కేంద్రీకరించియుంటుంది.

1896 సెప్టెంబరు1వ తేదీని అరుణాచలము వెళ్ళిన శ్రీరమణులు వారి అవతార సమాప్తి వరకు మరి యేక్షేత్రమునకు వెడలలేదు. ఆయన జీవితకాలములో పలువురు భక్తులు, శాస్త్రవేత్తలు, దేశ విదేశనేతలు, పీఠాధిపతులు మొ॥లగు ప్రముఖులు ఎందరో భగవాన్ దివ్యోపదేశమును గ్రహించి వారి అనుగ్రహమునకు పాత్రులైయుండిరి.

1950 ఏప్రియల్ 14వ తేదీ రాత్రి గం॥ 8–47ని॥లకు శ్రీ భగవాన్ మహానిర్యాణము నందిరి. ఆ రాత్రి సరిగా భగవాన్ నిర్యాణ సమయమున ఆయన దేహము నుండి యొక "జ్యోతి" పైపైగా పయనించుచూ అరుణాచల శిఖరములో లయమవడం జరిగినది. చారిత్రక నిదర్శనముగా ఈ సంఘటనను పలుప్రాంతములవారు దర్శించిన విషయమును ఆనాటి పత్రికలు ప్రచురించినవి. ఆయన జన్మించిన క్షణమున యొక అంధురాలుకి జ్యోతిగా కన్పించిన ఆదివ్యజ్యోతి మరల నిర్యాణ సమయమున అరుణాచల శిఖరములో చేరుటతో సమాప్తియైనది. దీనిని బట్టి అరుణాచల స్వరూపమే శ్రీరమణుల తేజోరూపమై భువిపై జ్ఞాన గురువుగా సంచరించి తిరిగి అరుణాచల శిఖరమున లయమైనది అను విషయము స్పష్టమైయున్నది.

– కె. వీరలక్ష్మి, విజయనగరం

**ఈ సంచికలో......**

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు**

02-4-03 భీమవరం ........ 3
18-3-03 చించినాడ ........ 7
12-3-03 జిన్నూరు ........ 12

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 2-4-2003, భీమవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం నూతనసంవత్సరంలోనికి ప్రవేశిస్తున్నాము. మనం కాలాన్ని సంవత్సరాలక్రింద, నెలల క్రింద, వారాలక్రింద, రోజులక్రింద ఇలా విభజించుకొంటున్నాము. కాలం అనంతం, అది ఎప్పుడూ అలా ప్రవహిస్తూనే ఉంటుంది. నేను కాలరూపంలో ఉన్నాను అని భగవంతుడు చెప్పాడు. మనం కాలాన్ని గౌరవిస్తే భగవంతుడిని గౌరవించినట్లు అవుతుంది. దేహప్రారబ్ధాన్ని అనుసరించి ఏ కాలంలో ఏది జరగాలో అది జరుగుతూ ఉంటుంది. వచ్చేవారు వస్తూ ఉంటారు. పోయేవారు పోతూ ఉంటారు. అయితే కాలం విలువ మనకు తెలియటంలేదు. మన దేహం ఎప్పుడూ ఉండదు. ఒక కాలంలో వచ్చింది, కొంతకాలం ఇక్కడ కనిపిస్తుంది, మరొకకాలంలో ఈదేహం పోతుంది. కాలప్రవాహానికి ఎవరూ ఎదురీదలేరు. ఒక సామాన్యమానవుడు ప్రధానమంత్రి అవ్వవచ్చు, ప్రధానమంత్రి ఏమీ పదవి లేకుండా పోవచ్చు. పదవి, అధికారం, ధనం ఇవిఅన్నీకూడా కాలప్రవాహానికి లోబడి ఉంటాయి. కాలప్రవాహంలో పెద్దపెద్ద సామ్రాజ్యములే అంతరించిపోయాయి. అందుచేత మనం కాలాన్ని గౌరవించాలి, కాలాన్ని సద్వినియోగం చేసుకోవాలి. సోమరితనంగా ఉన్నవాడు ఆధ్యాత్మిక విషయాలమాట అటుఉంచండి, భౌతికంగా కూడా అభివృద్ధిలోనికి రాలేడు. కాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవటం వలన ఆధ్యాత్మికంగాను, భౌతికంగాను అన్నీ బాగానే ఉంటాయి. అతినిద్ర, అతితిండి భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను కూడా ప్రమాదమే. అతిగా తినాలని ఉంటే అది ఒక శత్రువు. అతినిద్ర కూడా ఒక శత్రువు. మనం మాటలవిషయంలో, తలంపులవిషయంలో బహుజాగ్రత్తగా ఉండాలి. అజాగ్రత్త పనికిరాదు, అశ్రద్ధ పనికిరాదు. మనం మాటలు తగ్గించుకోవాలి. తలంపులు తగ్గించుకోవాలి. అప్పుడు చైతన్యస్థాయి పెరుగుతుంది. మనం తినే తిండి యొక్క ప్రభావం మన శరీరం మీద ఎలా ఉంటుందో అలాగే మనకు వచ్చే ప్రతితలంపు యొక్క ప్రభావం మన జీవిత విధానం మీద ఉంటుంది. అందరికి నేను అనే తలంపు ఉంది. భగవంతుడు ఉన్నాడని చెప్పేవాడు, లేడని చెప్పేవాడు కూడా నేను ఉన్నాను అని చెపుతాడు. ఆ ఉండటమే దేవుడు. నేను అనే తలంపు మనకు ఫిజికల్ హార్ట్‌లో నుండి రావటంలేదు, అది ఆధ్యాత్మిక హృదయంలోనుండి వస్తోంది. దానినే మనం మిధ్యానేను, రాంగ్ ఐ, దేహగతమైన నేను అని ఇలా పిలుస్తాము. దానిలో నుండి మనకు రాంగ్‌తింకింగ్ వస్తోంది. నువ్వు వేరు, నేను వేరు, నేను లోపలఉన్నాను, లోకం బయటఉంది, నారాయణుడు వైకుంఠంలో ఉన్నాడు అని మనకు వేరుబుద్ధి ఉంది. మనం ఆధ్యాత్మికహృదయంలోనికి వెళ్ళగలిగితే, అక్కడ ఉండగలిగితే ఈ వేరుబుద్ధి నశిస్తుంది గాని లేకపోతే అది నశించదు.





మన యజమాని, మన ప్రభువు మన లోపలే ఉన్నాడు. ఆయన లోపల ఉండి మనలను నియమిస్తున్నాడు. ఈ శరీరం భూమి మీదకుఏపనిమీద వచ్చిందో ఆపని పూర్తి అయ్యేవరకు అది ఉంటుంది, తరువాత ఒక్కక్షణం కూడా ఉండదు. కొంతమంది మొదటి ముద్ద తింటారు, రెండో ముద్ద తినకుండా చనిపోతారు. అంటే ఆ దేహం యొక్క ప్రారబ్ధం ననుసరించి రెండోముద్ద తినే యోగ్యత వాడికి లేదు. బుద్ధుడు ఒక మాట చెప్పాడు ఎవరింటికి వెళ్ళిచూసినా, ఏ ఊరు వెళ్ళిచూసినా రాగద్వేషములు తప్పించి ఈ ప్రపంచంలో ఏమీలేదు. లోకం అంటే ఏమీలేదు ఇష్టాలు, అయిష్టాలు. సైన్సు ఎంత అభివృద్ధి అయినా కుక్కతోక వంకరను ఎవరూ నిదానంగా చేయలేకపోయారు. కుక్కతోక ఎటువంటిదో మనచేత చూడబడే ఈలోకం కూడా అంతే. సైన్సు అభివృద్ధి అయిన మాట నిజంకాని మానవ మానసం ఏమీ అభివృద్ధి కాలేదు. మీకు ఏదైనా ఒకవస్తువు నచ్చింది అనుకోండి అది మట్టి అయినా మీ దృష్టిలో అది బంగారం, మీకు నచ్చలేదు అనుకోండి అది బంగారం అయినా మీ దృష్టిలో మట్టే, ఇది మనం లోకంలో చూస్తున్నాము. నేను ఏదో మాట్లాడుతున్నాను అనుకోండి, నా మాటల్లో మెస్సేజ్ లేదు అనుకోండి, మీరు నేర్చుకొనేది ఒక్క మాటకూడా లేదు అనుకోండి మీరు అందరూ రావటం మీకు టైమువేస్టు, చెప్పటం నాకు టైము వేస్టు. అలాగే ఏదైనా పుస్తకం చదువుతున్నారు అనుకోండి అందులో ఏమీ సందేశంలేదు అనుకోండి, దానిని తీసి ప్రక్కన పెట్టాలి. వివేకానందుడు ఒక మాట చెప్పారు. మీరు సముద్రంలో స్నానం చేయాలి అని వెళితే కెరటాలు తగ్గాక స్నానంచేద్దాము అని అనుకోవద్దు. ఎందుచేతనంటే ఆ కెరటాలు తగ్గవు. కెరటానికి కెరటానికి మధ్య మునిగి స్నానం చేసి రావాలి. సముద్రంలో కెరటాలు ఎలాగ ఉంటాయో అలాగే మన శరీరం చనిపోయేవరకు ఏవో ఒక సమస్యలు ఉంటాయి. ఆ సమస్యల మధ్య సాధన చేసుకొంటూ వెళ్ళాలి. ధనం లేనివారు అందరూ ధనవంతులు సుఖపడిపోతున్నారు అనుకొంటారు, వారికి అసలు సుఖంలేదు. మనకు లేనిది ఎవరికైనా ఉంటే వారు సుఖపడిపోతున్నారు అనుకొంటాము. కాని అది మనకు వచ్చాక అందులో కూడా సుఖం లేదని మనకు తెలుస్తుంది. అధికారంలో సుఖం ఉంది అనుకోండి, ధనంలో సుఖం ఉంది అనుకోండి వాటిని సంపాదించుకోండి అందులో సుఖం ఉంది అని భగవంతుడు చెప్పి ఉండేవాడు. మనకు సొంత బుద్ధి అవసరం. దాని వలన మనకు ఆత్మ విశ్వాసం కలుగుతుంది. సముద్రంలో కొంచెం లోపలకు వెడితే కెరటాలు ఉండవు. అలాగే మనకు కొంచెం లోచూపు కలిగితే, భగవంతుడు ఎక్కడైతే ఉన్నాడో ఆ హృదయంలోనికి మనం వెళ్ళగలిగితే లోకంలో ఉన్న సమస్యల యొక్క ప్రభావం మనమీద ఉండదు, అక్కడ ఉన్నది సుఖం, శాంతి, ఆనందం. కొంతమందికి లోచూపు ఉండదు, వెంటనే రియాక్టు అయిపోతారు. మీ భర్త కూర బాగాలేదు అంటే మీరు వెంటనే రియాక్టు అయిపోతారు. కోపం వచ్చేస్తుంది. అయ్యో

బాగా లేదేమో మనం ఇంకా బాగా వండటానికిప్రయత్నం చేద్దాము అనే స్వభావం మనకు రాదు. వెంటనే రియాక్టు అవుతాము అంటే మనకు లోచూపు లేదు అని అర్థం. నాకు ఈ మధ్య ఒక పేషెంట్ చెప్పాడు ఆయనకు జ్వరం వచ్చిందట, జ్వరంలో ఆయనకు నిద్రపట్టటంలేదు. అప్పడు ఈజ్వరం ఎవరకు వచ్చింది అని విచారణ చేసుకున్నారట, ఈ జ్వరం ఎవరికి వచ్చింది, దేహానికి జ్వరం వచ్చింది. నేను దేహాన్ని కాదుకదా, నేను ఆత్మను, నాకు ఈ జ్వరానికి సంబంధం ఏమిటి అని 5 నిమిషాలు విచారణ చేసాను వెంటనే నిద్రలోనికి వెళ్ళిపోయాను. స్లీపింగ్ టాబ్లెట్ అవసరం లేకుండా ఎంక్వైరీ వల్ల నిద్రలోనికి వెళ్ళిపోయాను అని చెప్పాడు. నేను ఆత్మే అయినప్పటికి, చనిపోయే దేహంతో తాదాప్యం పొంది, అదే నేను అనుకొంటున్నాను. అక్కడ నుండి దుఃఖం ప్రారంభమవుతోంది. నేను కానిదానిని నేను అనుకోవటం వల్ల దుఃఖం వస్తోంది. అదే రాంగ్ తింకింగ్. గాఢనిద్రలో మనం ఆనందంగా ఉన్నాము. ఎందుచేతనంటే అక్కడ దేహం గొడవ, లోకం గొడవ, ఏ గొడవ లేదు. గాఢనిద్రలో మనం ఏద్రైతే కాదో వాటిలో నుండి వేరుపడిపోయాము. అందుచేత అక్కడ సుఖంగా, శాంతిగా, ఆనందంగా ఉన్నాము.

సమాజానికి ఎంతో ఉపయోగపడుతున్నాము కాని ఎవరూ గుర్తించటంలేదు అని చాలామంది అంటారు. అది జీవలక్షణం. పని పనికోసమే చెయ్యి. గుర్తించటంకోసం పనిచేస్తే నీకు దేహబుద్ధి పెరుగుతుంది. సత్యానికి దూరమవుతావు. ఏమండీ మాకు ఇంకా జన్మలు వస్తాయా అని అడిగితే మన హృదయంలో ఉన్న సద్వస్తువుమనకు అనుభవంలోనికి వచ్చేవరకు, మనం ఏదిగా ఉన్నామో దానితో మనకు తాదాప్యం వచ్చేవరకు ఈ జన్మలు తప్పవు. దేహాలు వస్తూ ఉంటాయి. లోకాలు నిన్ను విడిచిపెట్టవు, మరణానంతర జీవితంకూడా ఉంది. మీకు సత్యానుభవం కలిగేవరకు పునర్జన్మ వస్తుంది. మనం కల్పించుకొన్న విషయాలనుండి మనకు దుఃఖం వస్తోంది. సత్యంలోనుండి దుఃఖం రాదు. హృదయగతమైన జీవితం మనకు ఉన్నప్పడు, చైతన్యంతో తాదాప్యం పొందుతున్నప్పడు బయట పరిస్థితులు ఎలా ఉన్నా మనకు ఇబ్బంది లేదు, మనలను అదృష్టం వెంటాడుతున్నా, దురదృష్టం వెంటాడుతున్నా, లోకంలో పరిస్థితులు మనకు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా మన శాంతికి భంగం లేదు. మనం పాడైపోవటానికి గర్వమే కారణం. కొంతమంది అప్ప దాచుకున్నట్లు గర్వం దాచుకుంటారు. లోపల గర్వం పెట్టుకొని పైకి వినయంగా ఉన్నట్లు నటిస్తారు, దీనివలన సమాజాన్ని మోసం చేయగలం గాని మనం మూలంలో పూర్తిగా చెడిపోతాము. ముందు మనకు ఉన్న బలహీనతలు ఏమిటో అర్థం చేసుకోవాలి. ట్రూత్‌ను రీలైజ్ చేయడానికి ఏవైతే అడ్డువస్తున్నాయో చూసుకొని వాటిలో నుండి విడుదల పొందటానికి ప్రయత్నం చేయాలి. అదే సాధన. పనిమానివేస్తే ఆధ్యాత్మికంగా





అభివృద్ధిలోనికి వస్తాము అని చాలామంది అనుకొంటారు. పని మానివేస్తే అధ్యాత్మికంగా అభివృద్ధిలోనికి రారు. సోమరితనం వస్తుంది. మనకు పనియందు గౌరవం లేదు. పనిలో భగవంతుడిని చూడు అని గీతలో పరమాత్మ చెప్పాడు. మన మనస్సులో ఉన్న బలహీనతలు, వ్యక్తి భావన, దేహబుద్ధి నశించేవరకు సాధన అనే యుద్ధం మనం చేస్తూ ఉండవలసిందే. ఏదో ఉదయం పూజ చేయటం మధ్యాహ్నానికి మోక్షం వచ్చేయాలి అలా ఉంది మన పరిస్థితి, మనకు సహనం లేదు. అహంభావన అత్యంత బలీయమైనది, అది నశించేవరకూ మనం సాధన చేస్తూ ఉండవలసిందే. అంతే గాని గంటసేపు ధ్యానం చేసాను నాకు రిజల్టు ఎప్పడు వస్తుంది అంటే దానికి అర్థం లేదు. సమాజసేవ ఎందుకు చేయమని చెప్పారు అంటే మనం చేసినంత మాత్రంచేత సమాజం ఉద్ధరింపబడుతుంది అని కాదు. దానివలన మనకు స్వార్థం తగ్గుతుంది, మనం పవిత్రులమవుతాము. ఎంతవరకు చేయగలిగితే అంతవరకు సాధన చేసుకోండి అంతేగాని గొప్పలు చెప్పకోవద్దు, గొప్పల వలన తిప్పలు వస్తాయి, పునర్జన్మలు పెరుగుతాయి. మీరు చేసి మర్చిపోండి, దేవుడు జ్ఞాపకం పెట్టుకుంటాడు. మీరు మర్చిపోరనుకోండి వారిపని వారే జ్ఞాపకం పెట్టుకుంటున్నారు ఇంక వారిగొడవ మనకెందుకు అని ఆయన మర్చిపోతాడు. మనం చేసేది నిదానంగా చేసుకొని వెళ్ళిపోవాలి, వచ్చేది ఏదో వస్తుంది, రానిది ఏదో రాదు. జరిగిపోయిన గొడవలు తలపెట్టుకోవద్దు, భవిష్యత్ గురించి గాలిమేడలు కట్టవద్దు, వర్తమానకాలాన్ని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. మనం ఏదో ఊహించుకోవటం వలన అది అలా జరగదు. భగవంతుడు సత్యసంకల్పుడు. ఆయన సంకల్పించిందే జరుగుతుంది. ఆయనసంకల్పించిందే సత్యము. మనకు ఏద్రైనా కలిసివచ్చింది అనుకోండి అది దేవునిప్రసాదం అనుకోము, మన తెలివితేటల వలన, కష్టపడటంవలన ఇది వచ్చింది అనుకొంటాము ఇదే మాయ. మన హృదయంలో ఉన్న సత్యం మనకు అనుభవంలోనికి వచ్చేవరకు ఇక్కడ కంటే అక్కడ బాగుంది. అక్కడ కంటే ఇక్కడ బాగుంది, ఎప్పడు సుఖపడిపోదాము అని ఇలా ఏదో ఒకటి అనుకొంటూ ఉంటాము. సత్యసాక్షాత్కారం అయ్యేవరకు మనకు స్వేచ్ఛ లేదు, స్వాతంత్ర్యం లేదు. భగవంతుడి కంటే మన క్షేమం కోరే వారు ఎవరు ఉంటారు. భయం తగ్గించుకోండి, కోపం తగ్గించుకోండి, విషయచింతన తగ్గించుకోండి, ఇష్టాలు అయిష్టాలు తగ్గించుకోండి అని భగవంతుడు చెపుతున్నాడు. భగవంతుడు మనకు తెలియకపోయినా శరీరం, మనస్సు మనకు తెలుస్తున్నాయి. మానసికఆరోగ్యం, శారీరకఆరోగ్యం కాపాడుకొంటూ హృదయగుహలోనికి ప్రవేశించాలి. మీలో ఎవరైనా కొంచెం ఇబ్బందులు పడుతున్నారు అనుకోండి చాలామంది కంటే మనం మెరుగుఅని అనుకోండి. మనకు కనీసం తినటానికి తిండి, కట్టుకోవటానికి బట్ట, మనం చేసుకోవటానికి పని ఉంది. మనం కోటీశ్వరులం

కాకపోయినా కొన్ని కోట్ల జనం కంటే మనం మెరుగు. ఎవరో టాటా, బిర్లాలను పోల్చుకొని మనం దారిద్ర్యం అనుభవించవలసిన పనిలేదు. మీకు ఏదైనా కలిగిఉంటే యితరులకు షేర్ చెయ్యండి. భగవంతుడు కొంతమందికి తెలివినిస్తాడు, కొంతమందికి ధనం ఇస్తాడు. భగవంతుడు ఇచ్చిన దానిని సమాజం కోసం కొంత ఉపయోగించండి, అది కూడా కోరిక లేకుండా చేయండి, అప్పుడు భగవదనుగ్రహానికి పాత్రులవుతారు.

**సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణములు, 18-3-2003, చించినాడ**

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మనం ఈ ప్రపంచంలోనికి వచ్చాము గాని మనం ఎందుకు వచ్చామో ఆపని చేసుకోవటం లేదు, వచ్చిన పని మర్చిపోయాము. మనకు ఆత్మవిశ్వాసం ఉండాలి, అది ముఖ్యం అంతేగాని ఇతరులందరిచేత మంచి అనిపించుకోవాలి అనుకోవటం వలన ఆధ్యాత్మిక పురోభివృద్ధి ఆగిపోతుంది. మనకు భగవంతుడు ఏపని అయితే ఇచ్చాడో ఆ పనిని శ్రద్ధగా నిండుమనస్సుతో చేసుకొంటూవెళ్ళాలి. మనం ఈ భూమి మీదకు వచ్చిన పనిని మర్చిపోతే మనకు ఇలా దేహాలు వస్తూనే ఉంటాయి. ఒక దొరగారు భగవాన్‌తో మాట్లాడుతూ ఈ ప్రపంచం ఎంత అద్భుతంగా ఉంది, సూర్యుడు ప్రకాశిస్తున్నాడు, చంద్రుడు చల్లదనాన్ని ఇస్తున్నాడు, ఋతువులు మారుతున్నాయి. ఎంత అద్భుతంగా వీటిని సృష్టించాడు. ఆయన సృష్టి ఇంత గొప్పగా ఉంటే ఇంక ఆయన ఎంత గొప్పగా ఉంటాడో అంటున్నారు. భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే ఇంతకంటే గొప్పసృష్టినీలోపల జరుగుతోంది. అది చూసుకోవటం మానివేసి బయటకు చూస్తున్నావు. నీకు గాఢనిద్రలో మనస్సు ఇంద్రియాలు పనిచేయటం లేదు. మెలుకువవచ్చేసరికి లోపల ఎక్కడినుండి వస్తోందో తెలియటంలేదు నేను అనే తలంపు వచ్చేస్తుంది. మరల రాత్రి నిద్రపోయేటప్పడు ఈ నేను అనే తలంపు లోపలకు పోతుంది, అది ఎక్కడికి పోతోందో మనకు తెలియటంలేదు. ఈ నేను అనే తలంపు లోపలనుండి బయటకు వస్తుంది, బయటనుండి లోపలకు పోతుంది. నీలోపలఉన్న సృష్టికంటే గొప్పగా ఉందా ఈ బయట సృష్టి? ముందు నీలోపలఉన్న సృష్టిని అర్థంచేసుకో. భగవాన్‌తో మనం ఎలా మాట్లాడినా, ఎక్కడ మొదలుపెట్టినా మూలతలంపును దాని మూలంలోనికి పంపటానికే ఆయన ప్రయత్నం చేస్తారు.

భగవాన్ దగ్గరకు ఒక అబ్బాయి వచ్చాడు,. మీతో మాట్లాడటానికి వచ్చాను, ఎవరూ లేనప్పడు మీతో మాట్లాడాలి అని చెప్పాడు. అయితే ఎవరూలేనప్పుడు రా అన్నారు భగవాన్. ఎవరూ లేనప్పడు చూసుకుని ఆ అబ్బాయి భగవాన్ దగ్గరకు వచ్చాడు. ఇప్పడు ఎవరూ లేరా అని భగవాన్ అడిగారు. ఎవరూ లేరు, నేను ఉన్నాను అని చెప్పాడు. ఎవరూ





లేనప్పడు రమ్మని చెప్పాను కదా, మరి నేను ఉన్నాను అంటున్నావు కదా, వాడుకూడా పోయినతరువాత రా అన్నారు భగవాన్. దాని అర్థం ఏమిటి అంటే నేను ఉన్నాను అంటున్నావు కదా ఆతలంపును కూడాపోగొట్టుకొని రమ్మని చెప్పకుండా చెప్పటం. మిధ్యానేను ఎక్కడయితే నశించిందో అక్కడ ఆత్మగతమైన నేను నీకు స్వరూపంగా వ్యక్తమవుతుంది అని చెపుతారు. మనందరకు ఆనందం కావాలి. ఆనందం ఎందుకు కావాలి అంటే మన స్వరూపమే ఆనందం. దేహప్రారబ్దాన్ని బట్టి ఒకో కాలంలో సంతోషం, ఒకో కాలంలో దుఃఖం వస్తుంది. అదృష్టం వెంటాడుతూ ఉంటే సుఖంగా ఉంటాము, దురదృష్టం వెంటాడుతూ ఉంటే దుఃఖంగా ఉంటాము. మన శరీరం ఎంతనిజమో, మన మనస్సు ఎంతనిజమో మనకు వచ్చే సంతోషం, దుఃఖం కూడా అంతే నిజం. ఇందులోనుండి బయట పడటానికి యోగం అవసరం. మనం సంతోషం వచ్చినప్పడు ఇష్టపడుతున్నాము, దుఃఖం వచ్చినప్పడు వద్దు అనుకొంటున్నాము. కాని ఈ రెండింటిని సమానంగా తీసుకో అని గీతలో పరమాత్మ చెప్పాడు. మీకు ఎప్పడైనా దుఃఖం వస్తే కంగారు పడకండి. దుఃఖం యొక్క అడుగున ఆనందం ఉంది. అర్జునుడికి మొదటి అధ్యాయంలో విషాదం వచ్చింది, ఆ విషాదం జ్ఞానానికి దారి తీసింది. అర్జునుడికి విషాదంలోనుండి విచారణ వచ్చింది, మనకు విషాదంలోనుండి రోగం వస్తుంది. ఎందుచేతనంటే మనకు విచారణ లేదు. విషాదం వస్తే వద్దు, వద్దు అనకండి. ఆ విషాదం ఎవరికి వస్తోంది అని ప్రశ్నించుకొంటే అది కూడా మిమ్మల్ని ఆనందంలోనికి తీసుకొనివెళుతుంది. మనం దైవీసంపదను పెంచుకొంటూ రావాలి. మీరు ఏది కోరుకొంటున్నారో అది చేయాలని ఈశ్వరుడు అనుకోడు. మనకు ఏదిమంచిదో అది చేయాలి అనుకొంటాడు. మనం జ్ఞానం కోరుకోకపోయినా మనలను జ్ఞానం దగ్గరకు తీసుకొనిపోతాడు, వాడే ఈశ్వరుడు. భగవంతుడు కంటే మనలను ప్రేమించేవాడు ఈ సృష్టిలో ఎవరూ లేరు. ఈ లోకంలో అన్ని ప్రేమలకంటే తల్లిప్రేమ గొప్పది అని చెపుతారు కాని నీ ప్రేమ ముందు, నీ దయముందు తల్లి ప్రేమ ఏపాటిది అంటారు అక్షరమణమాలలో భగవాన్. భగవాన్‌తో ఒకరు మాట్లాడుతూ నేను పూర్వజన్మలో ఏదైనా పుణ్యం చేసానా అని అడిగారు. నీవు పూర్వజన్మలో ఏమీ చెయ్యకపోతే ఇక్కడకు ఎందుకు వస్తావు, పూర్వ జన్మలో ఎంతోకొంత పుణ్యం చేయకపోతే ఇక్కడకు రావాలనే సంకల్పం కూడా నీకు రాదు, నువ్వు పూర్వజన్మలో చేసిన పుణ్యమే నిన్ను ఈ సన్నిధానంలోనికి తీసుకొని వచ్చింది, అది దైవీసంపద. మూలతలంపు దాని మూలంలోనికి ఉపసంహరింపబడటానికి దైవీసంపద నీకు సహకరిస్తుంది. నీ హృదయంలో సత్యం ఉంది. నేను పుట్టాను అనుకొనేవాడికి అది తెలియబడదు. నేను చనిపోతున్నాను అనుకునేవాడికి అది తెలియదు. శరీరం చనిపోతున్నప్పటికి నేను చనిపోవటం లేదు అని ఎవరికైతే అనుభవంలోనికి వచ్చిందో వాడికి సత్యం తెలియబడుతుంది. శాస్త్రవాసన తగ్గించుకో. శాస్త్రాన్ని ఎంతవరకు

ఉపయోగించుకోవాలో అంతవరకు ఉపయోగించుకో. అందరూ నన్ను మంచివాడు అనుకోవాలి అని అనుకొంటే నీవు సత్యానికి దూరమవుతావు, లోకానికి దగ్గరవుతావు. లోకానికి దగ్గరవటమే కాదు ఆజన్మకు ఆజన్మ లోకవాసన పెరిగిపోతుంది. ఎవరు ఎన్ని శాస్త్రాలు చదివినా ధర్మాన్ని ఆచరించకపోతే లోపలఉన్న అమృతత్వం నీకు తెలియదు. ధర్మాన్ని ఆచరించాలంటే ఇష్టాయిష్టాలు తగ్గించుకోవాలి. రాగద్వేషముల కారణంగానే మనస్సు బాహ్యముఖానికి వెళుతుంది. నీ లోపల ఒక్కవాసన ఉన్నా హృదయగుహలో ప్రవేశించలేవు. పుట్టినవాడు చనిపోతాడు, చనిపోయినవాడు పుడతాడు, చేసినవాడు అనుభవిస్తాడు. దేహం పుట్టింది, అది చనిపోతుంది, అహంకారం చేసింది అది అనుభవిస్తుంది. వీటి గోల నీకు ఎందుకు. నువ్వు ఎలాగ ఉన్నావో అలాగ ఉండు. నువ్వు దేహంగా, మనస్సుగా ఉన్నాను అనుకొన్నప్పుడు కూడా నువ్వు బ్రహ్మస్వరూపమే. దేహమే ఆత్మ అనుకొంటున్నావు. దేహాత్మబుద్ధిలోనుండి బ్రహ్మాత్మ బుద్ధిలోనికి మళ్ళటమే మన సాధన యొక్క ప్రయోజనం. ఇప్పుడు మనకు నేను అనేటప్పటికి దేహము గుర్తుకు వస్తుంది. నేను అనేటప్పటికి బ్రహ్మం స్ఫురించాలి. ఇటువైపునుండి అటువైపుకు మనస్సును మళ్ళించటమే సాధన యొక్క ప్రయోజనం. దేహాత్మబుద్ధిలోనుండి బ్రహ్మాత్మబుద్ధిలోనికి మళ్ళించటంకోసం మనం పూజ, జపం, ధ్యానం చేస్తున్నాము. దీనికి గురువుఅనుగ్రహం అవసరం. సంకల్ప వికల్పాలు ఎప్పుడైతే నశించామో అప్పుడు నీకు మనస్సు నశిస్తుంది. మనస్సు నశిస్తే నీవు నశించవు. ఎక్కడైతే మనస్సు నశించిందో అక్కడ సత్యం నీకు స్వరూపంగా గోచరిస్తుంది.

ఈశ్వరుడు ఉన్నాడు అనే విశ్వాసం మనకు ఉంటే, శ్రద్ధ మనకు ఉంటే, మనకు ఉన్న విశ్వాసం, శ్రద్ధ నిజమైతే అన్ని సుగుణాలు వచ్చి మనల్ని వరిస్తాయి. ఆత్మానుభవం పొందడానికి సుగుణాలు మనకు సహకరిస్తాయి. మేము చాలా బాగా జీవిస్తున్నాము, చాలా మంచివారము అని మీరు అనుకోవటం వలన ఏమీ ప్రయోజనం లేదు. మీ మంచితనం గాని, మీ నైతికవిలువ గాని మీ ఆలోచనను పెంచలేదు అనుకోండి, ఆమంచితనం వలన ఏమీ ప్రయోజనం లేదు. మీలో ఏదైనా ఔన్నత్యం ఉంటే అది మీ ఆలోచనను చంపేదిగా ఉండకూడదు, మీ ఆలోచనను పెంచేదిగా ఉండాలి. నీకు ఉన్న మంచితనం,నైతికవిలువలు, సమర్థత, ఇవన్నీ నిజమైతే అవి నీ ఆలోచనను పెంచాలి, నీ వివేకాన్ని పెంచాలి, నీ ఆలోచన అమృతత్వం పొందటానికి దారితీయాలి, నన్ను గుహలో కూర్చొని ధ్యానం చేసుకోమంటారా లేకపోతే లోకానికి సేవచేయమంటారా ఏది మంచిది అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. రెండూ మంచివే. నీకు నచ్చిన మార్గం పట్టుకొని నువ్వు ప్రయాణం చేస్తే మిగతావి అన్ని అందులో కలిసిపోతాయి. నువ్వు చేసే లోకసేవ నిజం అనుకో ధ్యానం చేయటం వలన వచ్చే ఫలితం కూడా అందులో వచ్చేస్తుంది. నువ్వు





చేసే ధ్యానం నిజం అనుకో లోకసేవ చేయటం వలనవచ్చే ఫలితం ధ్యానంలో వచ్చేస్తుంది. నిన్ను నీవు బాగుచేసుకోవటం లేదు ఇంక లోకాన్ని ఏమిబాగుచేస్తావు. నీ బాగులోనే లోకంయొక్క బాగు ఉంది. నువ్వు ఎంతవరకు బాగుచేసుకొంటే లోకం అంతవరకు బాగుపడుతుంది. నీకు ఎన్ని తలంపులు వచ్చినా కంగారుపడకు. ఈ తలంపులు అన్నీ ఎవరికి వస్తున్నాయి, నేనుకు వస్తున్నాయి. ఆ నేను కూడా ఒకతలంపే. ఆ నేనును ప్రశ్నించటం వలన అది దాని మూలంలోనికి ఉపసంహరింపబడుతుంది, దాని మూలాన్ని చూసినవెంటనే అది నశిస్తుంది, అది నశించిన వెంటనే నీలో ఉన్న అమృతత్వం నీకు తానుగా వ్యక్తమవుతుంది. బాహ్యముఖంగా విజృంభిస్తున్న మనస్సుకు లోచూపు కలుగజేసేవారు భగవాన్. మనస్సుకు లోచూపు కలుగకపోతే వాడికి ఆత్మజ్ఞానం కలుగదు.

నేను పూజ, జపం, ధ్యానం చేస్తున్నాను. నాకు అమృతానుభవం కలగటానికి ఇవి సరిపోతాయా లేక గురువు అనుగ్రహం కూడా కావాలా అని అడుగుతున్నారు. కావలసింది అది ఒక్కటే, మిగిలినవన్నీ రెండవ పక్షం అన్నారు. నీ మనస్సును లోపలకు మళ్ళించేది గురువు అనుగ్రహమే. గురువు అనుగ్రహం అత్యంత బలీయమైనది. అహంభావన అనే ఏనుగు గురువు అనుగ్రహం అనే సింహానికి మాత్రమే లొంగుతుంది. అమృతానుభవం పొందాలనే జిజ్ఞాస నీకు బలంగా ఉంటే తలంపులన్నీ పోతాయి. మనకు ఉండవలసినంత సహనం, ఓర్పులేదు. సహనంలోనుండి శక్తి కలుగుతుంది. పరమాత్మలోనుండి నీకు ఆనందం అందుతూ ఉంటే, ఆ ఆనందానుభవంలో నూటికి నూరుపాళ్ళు నీకుతృప్తి కలుగుతూ ఉంటే, అలా పరమాత్మలో నీవు స్థిరపడిఉంటే వాడినే జ్ఞాని, స్థితప్రజ్ఞుడు అంటారు. గజేంద్రుడిని మొసలి పట్టుకొంది, చాలాకాలం దానితో పోరాడాడు. చివరకు నేను నిస్సహాయుడను, నన్ను రక్షించు అని విష్ణువుని ప్రార్థిస్తాడు. అప్పుడు విష్ణువు వచ్చి మొసలిని సంహరిస్తాడు. ఇప్పుడు నీకు సంతృప్తి అయ్యిందా అని గజేంద్రుడిని అడుగుతాడు. అప్పుడు గజేంద్రుడు ఈ దేహం ఏదో రోజు చనిపోతుంది, ఈ దేహంతో ఏనేను అయితే తాదాప్యం పొందుతోందో అందులో నుండి నన్ను విడుదలచెయ్యి అప్పుడుకదానాకు మోక్షం అని ప్రార్థిస్తాడు. గజేంద్రుడిని ఒకటచ్‌చేస్తే చాలు ఆయన పని పూర్తి అయిపోయింది. దేహానికి సంబంధించిన, లోకానికి సంబంధించిన, శాస్త్రానికి సంబంధించిన తలంపులు ఎంతకాలం అయితే ఉన్నాయో అంతకాలం నువ్వు విచారణ విడిచిపెట్టకు. ఈ శరీరానికి వచ్చిన రోగంలో నుండి విడుదల అవ్వటానికి మనం ఎంత సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తామో అజ్ఞానం అనే రోగంలో నుండి విడుదల పొందటానికి అంత సిన్సియర్‌గా ప్రయత్నం చేస్తే దానిలోనుండి విడుదల పొందుతాము.

నేను బాధపడిపోతున్నాను, మీరు ఏవో వేదాంతం మాటలు చెపుతున్నారు, నా

బాధ తగ్గటం లేదు అని ఒకరు భగవాన్‌తో చెపుతున్నారు. ఆ బాధ నీది కాదురా, భగవంతుడిది అన్నారు. ఈ బాధ నాది కాదు, భగవంతుడిది అనుకో నీకు వెంటనే సమస్య పరిష్కారం అయిపోతుంది అని చెప్పారు. భగవంతుడు తన శరీరంకంటే భక్తుడి శరీరాన్ని బాగా చేసుకొంటాడు, వాడే భగవంతుడు. నాకు బాధ అంటున్నావు, అసలు నువ్వు అంటూ ఉన్నావా? అసలు నువ్వే లేవు ఇంక నీకు బాధ ఏమిటి? ఈ మాట మీకు జీర్ణం అవ్వాలి. మనం శ్రవణం చేస్తున్నాము గాని మనకు ఆమాట జీర్ణం అవ్వాలి, మన అవగాహనకు అందాలి అప్పడు దాని వైభవం మనకు తెలుస్తుంది, ఆశబ్దం యొక్క విలువ, దాని బరువు మనకు తెలుస్తాయి. శబ్దం పరమేశ్వరుడు, అర్థం పార్వతీదేవి, పార్వతీ పరమేశ్వరులను మనం సమానంగా ప్రేమించాలి, బేధం పెట్టుకోకూడదు. మనం ఏదైతే అవునో దానిని విడిచిపెట్టి మనస్సు విషయాలను చింతిస్తూ ఉంటే మనకు తగినంత వైరాగ్యం లేదు అని మనలను మనం అంచనా వేసుకోవాలి. జ్ఞానసముపార్జనకు వైరాగ్యం, అభ్యాసం ఇవి రెండూ ముఖ్యం. మీరు పాయసం నోట్లో పోసుకున్నప్పడు పాయసాన్ని ఎలా ఎంజాయ్ చేస్తున్నారో అలా ఈ మాటలను ఎంజాయ్ చెయ్యాలి. మీరు ఎంజాయ్ చేయకుండా ఇతరులకు చెప్పినా ప్రయోజనం లేదు. జీవన్ముక్తుడు అంటే వాడికి భూతకాలం స్మృతి ఉండదు, భవిష్యత్ గురించి గాలి మేడలు కట్టటం అసలే ఉండదు, వర్తమాన కాలంలో భోగం వచ్చినా, రాకపోయినా అసలు వాటి మీద ధ్యాసే ఉండదు వాడు జీవన్ముక్తుడు. ఈ దేహం చనిపోయినప్పడు మనస్సు కూడా చనిపోతే బాగుండును కాని మనస్సు చావటం లేదు, పునర్జన్మ వస్తోంది ఈ గోల ఏమిటి అని ఒకరు భగవాన్‌ను అడుగుతున్నారు. ఈ శరీరం మరణించేలోపు నీ మనస్సు తనస్వస్థలం అయిన హృదయంలో స్థిరపడితే ఇంక నీకు పునర్జన్మతో పనిలేదు. మనస్సులో వికారాలు ఉన్నంతసేపు దానికి ట్రైనింగ్ కావాలి. ట్రైనింగ్ పొందటం కోసమే ఈ శరీరం భూమిమీదకు వచ్చింది. వచ్చిన పని పూర్తి అయిపోతే ఇంక రాకపోకలతో పనిలేదు. వచ్చిన పని పూర్తి అవ్వకపోతే మరల శరీరాలు ధరించాలి. జీవితం అంటే అన్నంతినటం, బట్టలు కట్టటం అని అనుకొంటే పరమార్థం అందదు. అమృతత్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మనం ఈ భూమి మీదకు వచ్చాము. వచ్చిన పనిని పూర్తిచేసుకోవటానికి ప్రయత్నం చేయాలి. ఎవరైనా మంచి మాటలు చెపితే వినవచ్చు కాని నీ మనస్సు యొక్క స్వతంత్రతను పోగొట్టుకోవద్దు, బానిసగా ఉండవద్దు. స్వతంత్రతను పోగొట్టుకొంటే సత్యాన్వేషణబుద్ధి తగ్గిపోతుంది.





## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 12-3-03, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

అహంవృత్తి లేకుండా జీవించటమే తపస్సు. మనం తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉండాలి. మనం తినే ఆహారమే మనస్సు క్రింద మారుతుంది. తినే ఆహారం విషయంలో జాగ్రత్తగా ఉంటే మన మనస్సు స్వాధీనంలో ఉంటుంది. సాధనకు శారీరక ఆరోగ్యం, మానసిక ఆరోగ్యం అవసరం. మనకు కారు ఉంటే అవసరమైనప్పడు ఉపయోగించుకొంటాము అంతేగాని ఆకారు మనం కాదు. ఎక్కడికైనా వెళ్ళటానికి కారును ఎలాగ ఉపయోగించుకొంటావో, నీలోపల ఉన్న ఆనందాన్ని అందుకోవటానికి నీ దేహాన్ని అలాగ ఉపయోగించుకో. కాని దేహమే మీరు అని కూర్చుంటే చివరకు చీకటి లోకాలు మిగులుతాయి. మనం పూజలుచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా వాటి ద్వారా మనం స్వచ్ఛత, సమర్థత, ఏకాగ్రత సంపాదించుకోవాలి. మన మనస్సును స్వచ్ఛంచేసుకోవాలి. మనం ఏపని చేసినా సమగ్రంగా చేయాలి. ధ్యానం వలన మనకు ఏకాగ్రత రావాలి. ఏకాగ్రత లేనివాడు జీవితంలో ఏదీసాధించలేడు. ఉన్నది ఈశ్వరుడు ఒక్కడే. రమణమహర్షి ద్వారా అనుగ్రహం వచ్చినా, రాముడి ద్వారా అనుగ్రహం వచ్చినా, రామకృష్ణుడిద్వారా అనుగ్రహం వచ్చినా ఈసృష్టికి అంతకు యజమాని ఎవరో అక్కడ నుండే అది వస్తోంది. మీకు దుఃఖ కారణం బయటలేదు, మీలోపల అహంభావన రూపంలో ఉంది. అహంభావన అంటే కోపంకాదు. అహంభావనకు ఇష్టం, అయిష్టం, కోరిక, కోపం వస్తుంది. అసత్యాన్ని మీరు సత్యం అనుకొన్నంతకాలం మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. ఆత్మజ్ఞానసముపార్జనకు విచారణమార్గం, కర్మమార్గం, భక్తి మార్గం ఇలా అన్ని మార్గాలు మంచివే అయితే నీవు ఏమార్గాన్ని అనుసరిస్తున్నావో ఆ మార్గంలో త్రికరణశుద్ధిగా నడవాలి. మనం అసలు శరీరరహితులం, లోకరహితులం, మనోరహితులం మీరు నోటితో చెప్పే ఈ మాట ఏ జన్మలో అయితే మీకు అనుభవంలోనికి వస్తుందో అప్పడు పునర్జన్మలు అనే జబ్బులో నుండి విడుదల పొందుతారు. రోడ్డుమీద ఉన్న మురికి కంటే ఎక్కువ మురికి మన మనస్సులో ఉంది. మనం రోడ్డుమీద ఉన్న మురికి గురించి ఆలోచిస్తాము కాని మన మనస్సులో ఉన్న మురికిని చూసుకోము. మనం ఏదైతే నేను నేను అంటున్నామో అదే మొదటి తలంపు. ఆతలంపుకు ఇతర తలంపులు వస్తున్నాయి. ఏది మొదటి తలంపు, దానికి వచ్చే ఇతర తలంపులు ఏమిటి అని వాటిని విడదీయటం ముందు నేర్చుకోవాలి. మూలతలంపుకు ఇతరతలంపులకు తేడా తెలుస్తోంది అనుకోండి, మూలతలంపుకు వచ్చే ఇతర తలంపులు తగ్గిపోతున్నాయి అనుకోండి అప్పడు మూలతలంపు అది ఎక్కడ నుండి ఉదయించివస్తోందో అక్కడకు జరగటం మొదలుపెడుతుంది. మూలతలంపు దాని మూలమైన హృదయంలోనికి వెళ్ళి,

అక్కడ స్థిరంగా ఉంటే అది నశిస్తుంది, నీకు సత్యసాక్షాత్కారం అవుతుంది. డాక్టరు సర్జరీ చేసి ఒకనరం కోయాలనుకొన్నప్పుడు ఆనరం దగ్గరకు వెళ్ళేవరకు మిగతానరాలన్నీ తప్పించుకొంటూ వెళతాడు ఆనరం తప్ప ఇంకోనరం కోసివేస్తే దేహానికి అనారోగ్యం, చివరకు వాడి బాధ మామూలుగానే ఉంటుంది. అలాగే ఇది కూడా ఒక సర్జరీ దేహంతో తాదాప్యం పొందే మొదటి తలంపుకు, ఇతర తలంపులకు ఉన్న బేధం మీకు తెలియాలి, అది మీకు అవగాహన అవ్వాలి. అప్పుడు ఆమొదటితలంపును నాశనం చేయటానికి ప్రయత్నం చేయవచ్చు. మొదటితలంపు ఉంటే నీకు అంతా ఉంది, అది లేకపోతే ఏమీలేదు. శరణాగతి పొందినవాడు అన్నీ ఈశ్వరసంకల్పం ప్రకారం జరుగుతున్నాయి అనుకొంటాడు. శరణాగతి పొందినవాడికి మూలతలంపు అనే దుంప తొందరగా ఎండిపోయి రాలిపోతుంది. ఆ దుంప ఎండిపోవటానికి సిద్ధంగానే ఉంది కాని మనం ఎండిపోనివ్వకుండా నీళ్ళుపోసి దానిని పోషిస్తున్నాము, ఏవోలేనిపోని తలంపులు పెట్టుకొని దానికి నీళ్ళుపోస్తూ ఉంటే అది ఎలా ఎండిపోతుంది. ఆదుంప ఎండిపోయి రాలిపోతే నీకు దుఃఖంలేదు, దుఃఖంకారణం లేనప్పుడు నీకు పునర్జన్మలేదు, మీరు మంచిపనులు చేస్తూఉంటే బయట అందరూ మెచ్చుకోవచ్చు, మీకు పల్లకీ మోత ఉండవచ్చు మీరు మంచిపనులు చేసి లోపల మనస్సును పెంచుకొంటూ ఉంటే చివరకు అజ్ఞానం పెరుగుతుంది. లోపలకుళ్ళిపోతూ ఉంటారు, అది మీకు తెలియదు. జ్ఞానం పట్ల మనకు కాంక్ష ఉంటే మనకు గురువు దొరుకుతాడు, భగవంతుడు మనకు పరిస్థితులు అనుకూలంచేస్తాడు. మీకు పూర్వపుణ్యం లేకపోతే, ఈశ్వరానుగ్రహం లేకపోతే మీరు ఈశ్రవణం కూడా చేయలేరు. బ్రాహ్మీస్థితిని పొందేవరకు ప్రతీమానవుడు ఏజన్మలో ఉన్నాసరే కాలానికి, కామానికి లోబడతాడు. బ్రాహ్మీస్థితిని పొందినవాడు మాత్రమే కాలంలోనుండి, కోరికలనుండి విడుదల పొందుతాడు. నేను కృషి చేసుకొంటాను అని భగవాన్‌తో అంటే కృషిఅవసరమే, నీదేహప్రారబ్దంలో ఏపని ఉంటే ఆపని నిర్మలంగా నిశ్చలంగా చేసుకొంటూ వెళ్ళు, అలావెడితే నీకు తెలియకుండా మూలతలంపు దాని మూలంలోనికి జారిగిపోతుంది. మూలతలంపు లోపలకు వెడుతూ ఉంటే కోరికలు, వాసనలు తగ్గిపోతాయి. మూలతలంపు లోపలకు వెళ్ళటంలేదు అనుకో కోరికలు, వాసనలు ముసిరేస్తాయి. మీ సాధన ఎక్కడ గురిపెట్టాలి అంటే మీరు పూజచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా ఏసాధన చేస్తూ ఉన్నా దానివలన మూలతలంపు ఎంతవరకు పల్చబడుతోంది, అది ఎంతవరకు దాని మూలంలోనికి ఉపసంహరింపబడుతోంది అనేదాని మీద మీసాధన గురిపెట్టండి. మూలతలంపుకు లోచూపు కలిగినప్పుడు దానిని పట్టుకొని ఉన్న తలంపులు అన్నీ పోతాయి. మూలతలంపు దాని మూలంలో ఎప్పుడైతే లయమయిందో అప్పుడు సాధకుడికి తెలుసుకోవటానికి అంటూ ఇంక ఏమీమిగలదు, అంతాతానే. నీవు చేసేసాధన చిత్తశుద్ధితో చేయాలి. నాదినశిస్తే చిత్తశుద్ది వస్తుంది, నేను నశిస్తే జ్ఞానం





కలుగుతుంది. అనుకొనేది జీవసంకల్పం, జరిగేది సత్యసంకల్పం. నీ ప్రారబ్దంలో ఉన్నది నీకోరిక లేకుండా వస్తుంది, నాప్రారబ్దంలో లేనిది నీవు ఎంత ప్రయత్నం చేసినా రాదు ఇది నీకు అర్థం అవ్వాలంటే ఈశ్వర సంకల్పంమీద నీకు గౌరవం ఉండాలి, భగవంతుడి మీద సజీవమైన విశ్వాసం ఉండాలి. మీరు జపం, ధ్యానం చేసేటప్పుడు ఈనేను అనే తలంపు ఒకోసారి అణిగి ఉంటుంది అంతమాత్రంచేత అది నశించింది అని మీరు అనుకోవద్దు అది ఎప్పుడైతే ఉదయించిందో నువ్వు ఎవరు అని దానిని ప్రశ్నించవలసిందే, అజాగ్రత్త పనికి రాదు. ఈనేను అనే తలంపు ఎప్పుడు, ఎక్కడ, ఏక్షణంలో ఉదయిస్తూఉంటే అక్కడ దానిని తొలగించుకోవటానికి ప్రయత్నంచేసి విచారణామార్గంలో దానిని తొలగించుకోవలసిందే. నేను ఉదయించిన వెంటనే దానిని ప్రశ్నించుకోండి, అలా ప్రశ్నించటం మానివేస్తే లేనిపోని తలంపులను తీసుకొనివస్తుంది. వేటగాడు జంతువును ఏవిధంగా వెంటాడి వేటాడుతాడో అలాగ మీరు మూలతలంపును వెంటాడి వేటాడండి, అదేనిజమైనవిచారణ. మూలతలంపు దాని మూలంలోనికి వెళ్ళేవరకు విచారణ విడిచిపెట్టవద్దు. అది పూర్తిగా నశించాలి, కొంచం శేషం ఉన్నా పునర్జన్మను తీసుకొని వస్తుంది. మూలతలంపు వేరుతోసహా నశించాలి అప్పటి వరకు దానిని నమ్మటానికి వీలులేదు.

భగవంతుడు చెప్పిన ఒక్కవాక్యం ప్రోపర్‌గా అర్థంచేసుకొంటే 10సం॥లు ధ్యానం చేస్తే మీకు ఎంతఫలితం వస్తుందో ఆకరెక్టు అవగాహనవలన అంత ఫలితం వస్తుంది. దుఃఖం, భయం, కోపం వస్తే రానివ్వండి. ఇవన్నీ ఎవరికి వస్తున్నాయి? మూలతలంపుకే వస్తున్నాయి, దానిని విచారణ చేయండి, తల్లిబిడ్డలను ఎలా చూసుకొంటుందో అలాగ గురువు మీకు చాలా క్లోజ్‌గా ఉంటాడు. మీరు పుణ్యలోకాలకు వెళతారా అని చూడడు. మీ అహంభావన ఎప్పుడు లేస్తోందో చూసి సరిగ్గా అహంభావన మీద మొట్టికాయ మొట్టటానికి చూస్తాడు. గురువు మీ జబ్బును చూడడు, జబ్బుకు కారణాన్ని చూసి ఆకారణం మీద ఒక మొట్టికాయ వేస్తాడు, వాడు గురువు. గురువు మనలోపలఉన్నాడు, ఆయనను అనుభవంలోనికి తెచ్చుకోవటానికి మనకు ఏది అడ్డువస్తోందో మనకు తెలియకపోయినా గురువుకు తెలుస్తూ ఉంటుంది. ఆయన స్వరూపాన్ని మనం పొందేవరకు గురువు మనలను విడిచి పెట్టడు. ఈ దేహంచనిపోయి మనం ఇంకోజన్మలోనికి వెళ్ళినా, మనకు జ్ఞానం కలిగే వరకు గురువు మనలను విడిచిపెట్టడు. సాధనలో సక్సెస్ అవ్వాలంటే చిత్తశుద్ధి, ఏకాగ్రత ముఖ్యం. మీరు చేసే సాధనల వలన మనస్సు పల్చబడుతోందా, లేదా అని చూసుకోండి. మీరు ధ్యానం చేసి నేను ధ్యానం చేస్తున్నాను అని పదిసార్లు అనుకోవటం వలన మనస్సు చిక్కబడుతుంది. అటువంటి సాధనలు ఎందుకు అంటున్నారు భగవాన్. మీరు సాధన చేసి ఏది తొలగించుకోవాలి అనుకొంటున్నారో, అది ఎంతవరకు

తొలగింపబడుతోందో మీరు చూసుకోవాలి, అది సాధన రహస్యం. మీరు చేసే సాధన ఎవరో మెచ్చుకొంటారు అని చేస్తే సాధనాఫలితంరాదు. మీరు చేసేసాధన ఏకాగ్రతతో చేయాలి, చిత్తశుద్ధితో చేయాలి, సత్వగుణంతో చేయాలి, నిర్మలమైన మనస్సుతో చేయాలి లేకపోతే మీరు గమ్యాన్ని చేరుకోలేరు. నీ దేహానికి రోగం ఉన్నంతకాలం ఔషదం వాడాలి అలాగే నీకు తలంపులు ఉన్నంతకాలం, కోరికలు ఉన్నంతకాలం, నీలో అజ్ఞానం ఉన్నంతకాలం నేను ఎవడను అనే ప్రశ్నను విడిచిపెట్టవద్దు.

మీ హృదయంలో సత్యం ఉంది మీరు అన్నిశక్తులు ఉపయోగించి మూలతలంపును దాని మూలంలో ఉంచితే అదినశిస్తుంది, సత్యం నీకు తెలియబడుతుంది అని మీరు చెపుతున్నారు. ఇది ఇంటిదగ్గర ఉండి చేసుకోవచ్చా లేకపోతే కాశీగాని, రామేశ్వరం గాని వెళ్లమంటారా అని భగవాన్‌ను అడుగుతున్నారు. ఇంటిదగ్గర పని విడిచిపెట్టి ఎక్కడికైనా వెళ్లిపోతేజ్ఞానం రాదు, అజ్ఞానం పెరుగుతుంది. పని విడిచిపెట్టటం వలన సాధన ఏమీ పెరగదు. నేను అనే తలంపును తీసి ఒక ప్రక్కన పెట్టి మీరు పనిచేయాలి.. ఏది చేసినా అది భగవంతుడి పని క్రింద చెయ్యాలి. బంధువులు, స్నేహితులు, విరోధులు దేహప్రారబ్దాన్ని బట్టి సిద్దమవుతారు, దానికి చైతన్యానికి ఏమీ సంబంధంలేదు. ఆ మూలతలంపు ఎంత నిజమో బంధువులు, స్నేహితులు, విరోధులు, పరిసరాలు, నీచేతచూడబడే ప్రపంచంకూడా అంతే నిజం. మూలతలంపు లేనిదానిని ఉన్నదానివలె అనిపింపజేస్తుంది. మూలతలంపు ఉన్నంతకాలం నీకు దృశ్యం ఉంటుంది, దృశ్యం ఉన్నంతకాలం నీకు దుఃఖం ఉంటుంది. మనస్సనశించినవాడికి దృశ్యంలేదు, అంతాతానే. మూలతలంపు ఉన్నవాడికి చూచేవాడువేరు చూడబడేది వేరు, ఆలోచించేవాడు వేరు ఆలోచించబడేది వేరు ఈ ఆలోచించేవాడే అసలు నేరస్తుడని మనకు అర్ధం కావటంలేదు. ఇంటిదగ్గర ఉండిసాధన చేసుకోవచ్చు అని భగవాన్ చెపితే మీరు అయితే ఇంటిదగ్గరనుండి అరుణాచలం పారిపోయివచ్చేసారు, నన్ను ఇంటిదగ్గరే ఉండమంటున్నారు అని అతను భగవాన్‌ను అడుగుతున్నాడు. నువ్వు అడిగావు కాబట్టి చెపుతున్నాను నేను మధురాయి నుండి అరుణాచలం వచ్చేటప్పుడు ఎవరి సలహాఅడిగిరాలేదు. అరుణాచలం వచ్చి నేను కొత్తగా పొందింది ఏమీలేదు, నేను పొందినది ఏదో మధురాయిలోనే పొందాను, అరుణాచలం రావటం అనేది నాదేహప్రారబ్దం, దానికి జ్ఞానానికి ఏమీ సంబంధంలేదు అని చెప్పారు. మనం ఇంట్లో ఉన్నా, అరుణాచలంలో ఉన్నా, ఎక్కడఉన్నా ఇబ్బంది లేదు, నీమనస్సు హృదయంలోనికి వెళుతోందా, లేదా అది చూసుకో, నీ శరీరం ఎక్కడఉంది అనేది ముఖ్యం కాదు, పొందవలసింది నీవు పొందుతున్నావో లేదో చూసుకో. మనస్సును అరుణాచలం మీద పెట్టి నీచేతిని పనిమీద పెట్టు దాని వలన ఇబ్బందిలేదు. నీ మనస్సు గిరిని ధ్యానం చేస్తూఉంటే చెయ్యిపనిమీద ఉన్నా ఆధ్యాత్మిక అభివృద్ధి ఆగిపోదు. నీ మనస్సు నిర్మలంగా ఉంటే, నీ మనస్సు అరుణాచలాన్ని చింతిస్తూ ఉంటే ఇంటిదగ్గర పని పూర్వంకంటే ఇప్పడు బాగా చేస్తావు. దేహప్రారబ్దాన్ని బట్టి మీదేహం ఎక్కడ ఉండవలసివస్తే అక్కడ ఉంటుంది, దేహాన్ని ప్రారబ్దానికి వదిలెయ్యి, నీమనస్సు ఎలాఉంది, అది పల్చబడుతోందా లేదా, సాధనపేరు చెప్పి మనస్సులోఉన్న దుమ్మును దులుపుకొంటున్నారా లేదా, మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చేస్తోందా లేదా అది చూసుకోండి. మీరు చెప్పినట్లుగా ఇంటదగ్గర ఉండి సాధన చేసుకొంటాను అప్పడు ఏమి జరుగుతుంది అని అడుగుతున్నాడు. దానికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అప్పడు నీ ఇంట్లో వారి పట్ల నీభావం మారిపోతుంది. వారిని నీ స్వంతమనుషులుగా చూడవు, భగవంతుడు పంపిన మనుషులుగా చూస్తావు, నీ సాధనాబలంవలన మూలతలంపు అణిగిపోతుంది. అప్పడు బంధువులపట్ల, విరోధుల పట్ల, నీస్నేహితులపట్ల, సంఘటనల పట్ల నీదృక్పదమే మారిపోతుంది. ఎప్పడైతే నీ దృక్పదం మారిపోయిందో నీకు ప్రత్యక్షంగా వచ్చే లాభంఏమిటి అంటే నీ మనస్సుమీద వత్తిడి తగ్గిపోతుంది. వత్తిడి తగ్గిపోతూఉంటే మనస్సు బాహ్యాముఖానికి వెళ్లటానికి బదులు లోపలకు వెళ్లటం ప్రారంభిస్తుంది. మనస్సుకు బయట చూపుతగ్గిపోతుంది, లోచూపు పెరుగుతుంది. గడ్డిపరకను మన చేతిలో మోస్తూ ఉంటే ఎంత తేలికగా ఉంటుందో అంతతేలికగా, సహజంగా, నేనుపనిచేస్తున్నాను అనేతలంపు లేకుండా పనిజరిగిపోతుంది. హృదయగుహలో నీమనస్సును నిలబెట్టి ఉంచటం వలన మనస్సు నెమ్మదిగా సన్నగిల్లి అది నశిస్తుంది, అప్పడు హృదయంలోఉన్న సత్యం నీకు స్వరూపంగ వ్యక్తమవుతుంది. భగవంతుడు తనకంటే భక్తుడిని జాగ్రత్తగా చూసుకొంటాడు వివేకానందుడికి ఎవరో ఫస్టుక్లాసుటికెట్ కొని ఇచ్చారు, అందులో ప్రయాణం చేస్తున్నాడు. ఆయన జేబులో డబ్బులులేవు అందులో ప్రయాణం చేస్తున్నతోటి ప్రయాణికుడు ఇంటిదగ్గర నుండి తెచ్చుకున్న భోజనం తింటూ ఈసన్యాసులకు ఏమీ ఉండదు, అలా చూస్తూఉండవలసిందే, మనం సంపాదించుకొన్నాము టైముకు కావలసింది తింటున్నాము అంటున్నాడు. వివేకానందుడు ఆమాటలు పట్టించుకోలేదు. ఆమాటకు ఈశ్వరుడికి బాధ కలిగింది. రైలు తరువాత స్టేషనుకు వస్తోందిఅనగా భగవంతుడు ఒకభక్తుడికి స్వప్నంలో కనిపించి వివేకానందస్వామిని చూపించి ఆయన ఫలానా ట్రైనులో వస్తున్నాడు ఆహారం నీఇంట్లో ఏది రెడిగా ఉంటే అది తీసుకొని వెళ్ళు అని చెప్పాడు అతను అన్నీ పట్టుకొని వెళ్లి స్వామిజీకి ఇచ్చాడు. ఇవి అన్నీ ఏమిటి అని స్వామీజీ అడిగితే ఈశ్వరుడు నాకు స్వప్నంలో కనబడి చెప్పాడు వెంటనే పరుగుపెట్టుకొని తెచ్చాను అని భక్తుడు చెప్పాడు ఆక్షేపించిన వాడు ఇవిఅన్నీ చూస్తున్నాడు, వాడికి బుద్ధిరావటానికి ఇదిఈశ్వరుడు చేసిన పని. ఒక భక్తుడికి జరిగిన అగౌరవం, బాధ తనక్రింద తీసుకొన్నాడు, వాడు భగవంతుడు.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | |
|---|---|
| 25-4-03 | శుక్రవారం పోడూరు |
| 28-04-03 | సోమవారం భగవాన్ శ్రీరమణుని ఆరాధన శ్రీరమణ క్షేత్రం, జిన్నూరు. |
| 01-05-03 నుండి 04-05-03 వరకు హైదరాబాదు | |
| 5-5-03 నుండి 2-06-03 వరకు క్యాంపు | |

## "విషాద స్పర్శలేకుండా వెలుగు రేఖలు విచ్చుకోవు"

మనం నిద్రనుండి మేలుకొన్న తక్షణం అహంకారంతో తాదాప్యంపొంది సుఖదుఃఖాల్లో కలసిపోతాము. మనకు శరీరం వచ్చాక ఏదో ఒకటి జరగకుండా ఎలా ఉంటుంది? అలాజరిగిన దాన్ని గురించి పొంగిపోయానా లేదా కృంగిపోయినా ఆసమస్యపరిష్కారం కాదు. దుఃఖం వస్తే దానిలో ఏదోనిగూడరహస్యం ఉంది. ఇది నా ఆత్మవికాసానికి వినియోగపడేలా భగవంతుడు యిచ్చిన అవకాశమే అనే అవగాహనతో మన మానసికస్వభావం మారాలి. మనం విషయ సుఖాలను అనుభవిస్తూ అదే సమయంలో పరమసత్యాన్ని గ్రహించలేము. సుఖ-దుఃఖాలు అనుభవంతోనే శీలం నిర్మిత మౌతుంది. అధర్మపరమైన క్రియలు సలుపుట వల్ల అవి నెరవేరినా, నెరవేరకపోయినా పగ-ప్రతీకారం-భయం-అపకీర్తిసంప్రాప్తమై విషాదంలో మానవుడు కూరుకు పోతాడు. పిడతచెయ్యటానికి పైన కొట్టేదెబ్బలే ఈ భాదలు, మన విధికి మనమే కర్తలం అన్న వివేకం కడసారి జన్మల్లో గాని ధృడపడదు - తదుపరి కొత్త కర్మలను కొనితెచ్చుకోరు. సుఖాలలో దుఃఖందాగి ఉంటుంది, దుఃఖాల్లో సుఖందాగి ఉంది. జీవిత సంఘటనల్లో మనం పాఠాలు నేర్చుకోవాలి. హంసతూలికాతల్పంపై కూర్చుని దుఃఖం అంటే ఏమిటో తెలియని వానికి సత్యం ఎన్నటికీ తెలియబడదు. పూర్వజన్మ పుణ్యసంస్కారం ఉన్న వివేకికి యితరుల కష్టాలకు, అవస్తలకు మూలకారణం ఏదో ఉంటుంది అని గ్రహించి తనకు ఆ అవస్త రాకూడదని సత్యమార్గంలో పయనిస్తాడు. బుద్ధుని జీవితంలో నడుంవంగిపోయిన ముసలి వాడిని-రోగిని - శవాన్ని-సన్యాసిని చూచి జనన, మరణాలలో దాగిఉన్న దుఃఖాన్ని గ్రహించి స్వయంకృషితో జ్ఞాని అయ్యారు, కాని మూర్ఖునికి దెబ్బమీద దెబ్బ తగిలితే గాని సత్యాన్వేషణ లోనికి రాలేడు. చాకలి బట్టలను రాతిమీద బాదటం కసివల్ల కాదు మురికి పోవటానికే. అలాగే ఏదైనా కష్టం - నష్టం కలిగితే ఆయనదయే అనే విశ్వాసంతో సంతోషంగా జీవించాలి. లేదా కష్టాలు-నష్టాలు ఈ దృశ్యప్రపంచం అంతా మనోకల్పితమే, అసత్యమే, ఆత్మఒక్కటే సత్యం అది నేనే, నాకు ఇవి ఏమీ అంటుకోవు అన్న వివేకవంతమైన బుద్ధిమంతుడు విషయవలయంలోంచి తప్పకోగలడు. శ్రీనాన్న గారు అంటారు" మీ మనస్సు అంతర్ముఖం అవ్వటానికి బాధ ఉపయోగపడుతుంది. ఇవి కూడా పునాది రాళ్ళే కష్టం అంటే ఏమిటో తెలియని వానికి నిజమైన ఆనందం అనుభవానికి రాదు మీకు సంభవించే కష్టాలు ఓర్చుకొంటే మీ కన్నీళ్ళు ఆనందబాష్పాలుగా మారిపోతాయి" అన్నారు. ఆరోజుకోసం ఆశావాదంతో ఆనందంగా జీవిద్దాము.


సాగిరాజు రామకృష్ణంరాజు అర్ధవరం

20-04-2003



గ్రంధావిష్కరణ : ఉపమన్యుప్రోక్త శ్రీశివభక్తవిలాసంను ది. 30-3-03 ఆదివారం పాల్గుణ మాస శివరాత్రి మ॥గం॥ 2-00 లకు డి.యన్.ఆర్. కాలేజ్‌లో రామకృష్ణ సభాభవనం నందు శ్రీ నాన్నగారి అధ్యక్షతన శ్రీ రమణాశ్రమ ప్రెసిడెంట్ శ్రీ సుందరరమణన్ గారు ఆవిష్కరించినారు. ఈ ఆవిష్కరణ మహోత్సవమునకు కెనడాలోని అరుణాశ్రమ ప్రెసిడెంట్ శ్రీ డెన్నీస్ హార్టెల్ గారు మరియు ఋషిపీఠం ఆశ్రమ అధిపతి శ్రీ సామవేదం షణ్ముఖశర్మగారు విచ్చేసినారు. అనంతరం గ్రంధకర్త శ్రీ డా॥ గోనెళ్ళ సీతారామలింగేశ్వరరావుగారు, శ్రీ నాన్నగారు, శర్మగారు, సుందరరమణన్‌గారు, గ్రంధ ప్రాముఖ్యతగూర్చి ఉపన్యసించినారు.

---




ది. 13-4-2003న భీమవరం పట్టణంలోని డి.యన్.ఆర్. కాలేజ్ రామకృష్ణ సభాభవనము నందు కీ॥శే శ్రీ ఉద్దరాజు ఆనందరాజు గారి 24వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభకు సద్గురు శ్రీ నాన్నగారు అధ్యక్షత వహించారు. ఈ సభకు చీఫ్ కమీషనర్ ఆఫ్ ఇన్‌కమ్ టాక్సు, హైదరాబాదు శ్రీ రాయసం వెంట్రామయ్య గారు, డిప్యూటీ కమీషనర్ సేల్స్‌టాక్స్ శ్రీ హర్షవర్ధన్ గారు, శ్రీ కనుమూరి బాపిరాజు గారు మరియు భీమరం ప్రముఖులు విచ్చేసినారు. ఈ సభలో ఆనందజీవనులు అనే పుస్తకాన్ని శ్రీ రాయసం వెంకట్రామయ్యగారు ఆవిష్కరించినారు.

**రమణ భాస్కర**